

చిన్నారికి చికిత్స చేయించలేక రైతు ఆత్మహత్య

బైరెడ్డిపల్లి : కళ్లముందే క్యాన్సర్‌తో కూతురు అల్లాడుతుంటే తట్టుకోలేకపోయాడు.. అప్పు చేసైనా సరే కాపాడుకుందామనుకున్నాడు. 12 లక్షలు చేసినా కూతురికి క్యాన్సర్ తగ్గుతుందన్న ఆశ లేకుండా పోయింది. నమ్ముకున్న వ్యవసాయమూ నట్టేట ముంచింది. అప్పుల బాధతో రైతు రమేష్‌రెడ్డి (35) ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో అల్లపల్లి పంచాయతీ పరిధిలోని మూగనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఏడాది క్రితం కన్నబిడ్డ వైనిక (1.6 సంవత్సరం)కు క్యాన్సర్ అని నిర్ధారణ అయ్యింది. బిడ్డను బతికించుకునేందుకు చికిత్స కోసం 12 లక్షలు అప్పు చేశాడు. తీర్చేందుకు తనకున్న మూడు ఎకరాల్లో వివిధ పంటలు వేసేందుకు అప్పు చేసి మరీ పంట పెట్టాడు. వర్షాలకు పంట నష్టపోవడంతో అప్పుల వారి వేధింపులు తాళలేక శుక్రవారం వ్యవసాయ పొలం వద్దనే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య సావిత్రి, కుమార్తె వైనిక దిక్కులేనివారయ్యారు. ప్రభుత్వం స్పందించి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఇంటి'పన్ను'తోనే... 'చెత్త'కూడా..



విడిగా వసూలు చేసే విధానానికి స్వస్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రతినెలా వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి చెత్త పన్ను వసూలు చేయడం ఒక ఎత్తయితే, ఎంత వసూలు చేసినా పూర్తిస్థాయిలో వసూలు కాకపోవడం ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. కొన్నిచోట్ల ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుండడంతో కార్పొరేషన్ అధికారులు సరికొత్త వ్యూహం రచించారు. ఆస్తిపన్నుతో పాటే 'చెత్త' పన్ను వసూలు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. ఈ మేరకు డిమాండ్ నోటీసులను సిద్ధం చేస్తున్నారు. ఇలా చేస్తేనే చెత్త పన్ను 'వచ్చినట్లు' కడతారన్నది కార్పొరేషన్ అధికారుల వ్యూహం. ఆదాయాన్ని సమకూర్చుకోవడంలో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో చెత్తపై పన్ను(యూజర్ చార్జీలు) నెలకు రూ 50లక్షలు వసూలు చేయాల్సి ఉండగా కేవలం రూ 25నుంచి 30 లక్షలు మాత్రమే వసూలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో యూజర్ చార్జీలు పెంచి ఖజానా నింపుకోవడానికి చర్యలు చేపట్టారు. నెలకు 70నుంచి కోటి రూపాయిలు చేయాలన్న లక్ష్యం పెట్టుకున్నారు. ఏప్రిల్ 1నుంచి మున్సిపల్ కార్పొరేషన్ ,మున్సిపాలిటిలు ఇంటిపన్నుతో పాటు యూజర్ ఛార్జీలు(చెత్తపన్ను) కలిపి ఇంటి యజమానులకు డిమాండ్ నోటీసులు ఇవ్వనున్నారు. ఇప్పటి వరకు యూజర్ చార్జీలను ఆయా డివిజన్‌లో సచివాలయ ఉద్యోగులు వసూలు చేసి రశీదులు ఇచ్చేవారు. ఏప్రిల్ నుంచి ఆ విధానానికి స్వస్తి పలికి ఆస్తిపన్నుతో పాటు యూజర్ చార్జీలు కూడా కలిపి వసూలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆస్తిపన్నుతో పాటు యూజర్ చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర పభుత్వం 2020 సంవత్సరం నుంచి యూజర్ చార్జీలు వసూళ్లు మొదలు పెట్టింది. అయితే దీని పై ప్రజల నుంచి పూర్తి వ్యతిరేకత వచ్చింది. చెత్తపై పన్ను ఏమిటంటు ప్రజలు నిరసన చేశారు. వామపక్షాలు దీర్ఘకాలం పాటు ఉద్యమాలు నడిపాయి. అయినా ప్రభుత్వం తప్పనిసరిగా చెల్లించాల్సిందేనని సృష్టం చేసింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉన్నాయి. ఒక్కో డివిజన్‌లో చెత్తసేకరణకు వాహనాలు ఏర్పాటు చేశారు. యూజర్ చార్జీల కింద ప్రతి ఇంటికీ రూ 40, అపార్టుమెంట్‌లో ఉన్న వారికి రూ 50నుంచి 100 వసూలు చేస్తున్నారు. మురికి వాడలో నివాసం ఉన్నవారి వద్దనూ వసూళ్లు చేస్తున్నారు. కళ్యాణ మండపాలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్ నుంచి నెలకు 2వేల నుంచి 5వేలు వసూలు చేస్తున్నారు. ఈ యూజర్ చార్జీలను జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరిట వసూలు చేస్తున్నారు. అయితే వీటి నిర్వహణ బాధ్యతను మున్సిపల్ కార్పొరేషన్ అధికార్లు చూస్తున్నారు. తిరుపతి కార్పొరేషన్ ఇప్పటికే స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి వాహనాలను కొనుగోలు చేసింది. ఇప్పటికే టిప్పర్లు, ఆటోలు, పెద్దపెద్ద వాహనాలు కలిపి సుమారు 70దాకా ఉంటాయి. తిరుపతి కార్పొరేషన్‌లో సుమారు 3లక్షల మంది జనాభా కలిగి ఉన్నారు. 65వేలపైగా గృహాలు ఉన్నాయి. యూజర్ చార్జీలు పెంచి ఖజానా పెంచుకోవడం పట్ల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఉచితంగా కార్పొరేషన్ సేవలు అందించాల్సింది పోయి, ప్రజలపై భారాలు మోపడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏప్రిల్ నుంచి డిమాండ్ నోటీసులో యూజర్ చార్జీలు కలిపి ఇవ్వనున్నారు. దీనిపై ఈనెల 10తేదీ జరుగనున్న కౌన్సిల్ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే. ఇప్పటికే భారాలతో ప్రజలు సతమతమవుతున్నారు. అయినా ఆదాయమే పరమావధిగా ఉన్న కౌన్సిల్ నిర్ణయాలతో జనం మరింత ఇబ్బందులు పడక తప్పదు.

'ది చెన్నై సిల్క్స్' మూత

- రోడ్డున పడ్డ 65 మంది కార్మికులు
- ఆందోళనకు సిఐటియు సంఘీభావం

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

'ది చెన్నై సిల్క్' దక్షిణ భారత దేశంలోనే పేరుమోసిన వస్త్ర దుకాణం. అయితే అంచనా మేరకు వ్యాపారం జరగ లేదన్న సాకుతో చిత్తూరు బ్రాంచ్‌ను ఉన్నఫలంగా గురువారం రాత్రికి రాత్రే మూసి వేయడంతో అందులో పని చేస్తున్న 65 మంది కార్మికులు రోడ్డున పడ్డారు. తమ భవిష్యత్ ఏంటంటూ చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిపై కార్మికులు శుక్రవారం ఆందోళనకు పూనుకున్నారు. ఫ్యాక్టరీ ఎదుటే శిబిరం వేసి తమకు న్యాయం జరిగే వరకూ ఆందోళన విరమించేది లేదని దీక్షబూనారు. వీరి ఆందోళనకు సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. లేబర్ అధికారులు జోక్యం చేసుకుని ది చెన్నై సిల్క్‌ను తెరిపించి, కార్మికులకు న్యాయం చేయాలని నేతలు డిమాండ్ చేశారు.

ఏడేళ్ల క్రితం చిత్తూరులో ది చెన్నయ్ సిల్క్ బ్రాంచిని అత్యంత ఆర్భాటంగా ప్రారంభించారు. చిత్తూరు, పరిసర మండలాల నుంచి 65 మందికి పైగా సేల్స్‌మెన్స్‌ను, సేల్స్‌గర్ల్స్‌ను, టైలర్లను, స్వీపర్లను విధుల్లోకి తీసుకున్నారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగం లేకపోవడంతో చెన్నయ్, బెంగుళూరు వంటి మహానగరాలకు వలస పోలేని యువతీ యువకులు స్థానికంగా చిత్తూరులోని ది చెన్నయ్ సిల్క్ బ్రాంచిలో ఉద్యోగులుగా చేరారు. తక్కువ జీతమైనా కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉంటామని సరిపెట్టుకున్నారు. అయితే ఏడేళ్లపాటు పనిచేసిన కార్మికులను ఉన్నపళంగా తొలగించడంతో శుక్రవారం చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలోని దుకాణం ఎదుట రాస్తారోకో నిర్వహించారు. అయితే పోలీసులు రంగ ప్రవేశం చేసి కార్మికులతో చర్చలు జరిపారు. యాజమాన్యంతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని పోలీసులు కార్మికులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. ఆరు నెలలుగా కార్మికులకు చెల్లించాల్సిన వేతనాలు బకాయి ఉన్నట్లు సమాచారం. మరోవైపు ముందస్తు ఎలాంటి సమాచారం లేకుండా ఉన్నపళంగా వస్త్ర దుకాణాన్ని మూసివేయడం ఏంటంటూ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. కనీస కార్మిక చట్టాలను పాటించకుండా ఉద్యోగాల నుంచి తొలగించడం ఏంటంటూ మండిపడుతున్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తొలగించారని, ప్రశ్నిస్తున్న వారిని వేలూరు, చెన్నయ్ నగరాల బ్రాంచిలకు పంపుతామని చెబుతున్నారని, అయితే అంత దూరం వెళ్లి చాలీచాలని జీతాలతో ఎలా బతకాలని కార్మికులు వాపోతున్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల వేతనంతో పాటు, ఒక నెల జీతం బోనస్‌గా



ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

సిఐటియు సంఘీభావం

తమకు జరిగిన అన్యాయంపై అర్ధరాత్రి నుంచి ఆందోళన చేస్తున్న కార్మికుల శిబిరం వద్దకు వెళ్లి సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. కార్మికుల సమస్యలను ది చెన్నయ్ సిల్క్ యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేంద్ర, చైతన్యలు డిమాండ్ చేశారు. చైతన్య మాట్లాడుతూ కార్మిక చట్టం ప్రకారం ప్రతి ఉద్యోగికీ నోటీసులు ముందుగా ఇవ్వకుండా మూసివేయడం చట్టవ్యతిరేక చర్యని విమర్శించారు. కోట్ల రూపాయలు లాభాలు ఆర్జిస్తూ దేశంలో వివిధ రాష్ట్రాల్లో చెన్నయ్ సిల్క్ షాపులను ఏర్పాటు చేసి, చిత్తూరు షాపును మూసివేయాలని నిర్ణయించడంలో యాజమాన్యానికి దురుద్దేశం ఉందన్నారు. చట్ట ప్రకారం 8 గంటలకు బదులు 12, 13 గంటలు పని చేయించుకుంటూ, కనీస వేతనం చెల్లించకుండా ఉద్యోగులతో వెట్టిచాకిరీ చేయించుకుని ఉన్నపళంగా రోడ్డున పడేశారన్నారు. కార్మిక శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే షాపును తెరిపించి 65 మంది ఉద్యోగులను కొనసాగించాలని డిమాండ్ చేశారు.



కార్మికులకు న్యాయం చేయాలని వినతి

'సంకెళ్లు తెంచుకుంటూ' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రిటైర్డు ఐఏఎస్ అధికారి కాకి మాధవరావు రచించిన 'సంకెళ్లు తెంచుకుంటూ...(ఓ దళిత చీఫ్ సెక్రటరీ ఆత్మకథ)ను రాజ్యాంగ నిర్మాత డాక్టరు బాబాసాహెబ్ బిఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ ఆవిష్కరించారు. తిరుపతి ఎస్‌వియులోని శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ మాధవరావు తన ఆత్మకథను రచించి, భావిభారత పౌరులకు సమాజంలోని పరిస్థితులను అవగాహన కల్పించేందుకు కృషి చేశారన్నారు. సాధారణంగా పదవీ విరమణ అనంతరం విశ్రాంతి సమయాన్ని సేద తీరేందుకు ఉపయోగించుకుంటారని, కానీ మాధవరావు తన జీవితంలో పడిన కష్టాలను యువతకు తెలియజేసి, అలాంటి వాటిని ఎలా ఎదుర్కోవాలనే అంశాలను తన పుస్తకం ద్వారా తెలియజేందుకు కృషి చేయడం సమాజం పట్ల అయనకు ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందని వెల్లడించారు. చిన్నతనంలోనే ఆయన ఓ అణగారిన వర్గాలకు చెందిన వ్యక్తిగా అనేక కష్టాలు పడి, తల్లి ప్రోత్సాహంతో, తండ్రి సహకారంతో ఉన్నత చదువులు చదివి సమాజంలో అనేక కుళ్లును ఏరివేయాలని ఆలోచించారని, ఆ దిశగా



తన పయనం సాగిందన్నారు. ఈ పుస్తకం ద్వారా తాను పడిన కష్టాలు, ఎదుర్కొన్న సమస్యలు, వాటిని ఎలా పరిష్కరించాను, ఇంకా ఎలా చేస్తే బాగుంటదనే విసయాలను ప్రతి ఒకరికి అర్ధమయ్యే సులభతరమైన బాషలో అందించారన్నారు. సమాజం పట్ల ప్రతి ఒక్కరికి తప్పని సరిగా అవగాహన ఉండాలన్నారు. సమాజంలో మార్పు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పాలేరు స్థాయి నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదా వరకు కాకి మాధవరావు ఎదిగి, తన అనుభవాలను నేటి తరానికి అందించడం అభినందనీయమన్నారు. ఎస్‌వియు విసి రాజారెడ్డి మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో ఓ సాధారణ కుటుంబంలో పుట్టిన మాధవరావు, పాలేరు దగ్గర నుంచి జీవితాన్ని ప్రారంభించారని, అనేక ఇబ్బందులను, కష్టాలను అనుభవిస్తూ చదువు ఒకటే మనిషి తలరాతను మార్చగలదని అంబేద్కర్ చెప్పిన విసయాలను అవగాహన చేసుకుని, ఉన్నత చదువులు చదవి, సివిల్స్‌లో మెరిట్‌సాధించి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారని గుర్తు చేశారు. ఆయన రచించిన పుస్తకాన్ని నేటి తరం అవగాహన చేసుకోవాలన్నారు. సివిల్స్‌కు ప్రీపేర్ అయ్యే వారికి ఇది ఎంతో దోహదం చేస్తుందన్నారు. అనంతరం రచయిత కాకి మాధవరావు మాట్లాడుతూ సమాజంలో మార్పు కోసం, సమసమాజ స్థాపన కోసం, యువత అభివృద్ధి కోసం తన విశ్రాంతి జీవితంలో కూడా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ కె.ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ సెక్రటరీ కె.సునీత, డాక్టరు గౌతమ్, తిరుపతి విమానశ్రయం డైరెక్టరు ఎం.రాజా కిషోర్, నెదురుమల్లి రామ్‌కుమార్, శివ బాగ్యరావు, సిహెచ్.విజయరావు, ప్రసాదరావు, దినకరమూర్తి, సుబ్రమణ్యం, రిటైర్డు జడ్జీ గుర్రప్ప, జనార్ధన రావు, కిరణ్‌కుమార్, సిద్దోజిరావు, ఎం.బాలాజీ, సురేష్, ప్రొఫెసర్ సరసయ్య పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు 'ప్రైవేట్'లో అవకాశం : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్ ఆర్థికంగా వెనుకబడిన పేద కుటుంబాల విద్యార్థులకు ప్రైవేట్ అన్ ఎయిడెడ్ విద్యాసంస్థల్లో, 2023-24 విద్యా సంవత్సరం 1వ తరగతిలో అడ్మిషన్ కొరకు ఏప్రిల్ 1వ తేదీ నాటికి 5 సంవత్సరాలు వయస్సు పూర్తి అయిన పిల్లల వివరాలతో ఏప్రిల్ 10 వ తేదీ లోపు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని, జిల్లాలో 423 ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 4230 మందికి అవకాశం వుందని కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా హక్కు చట్టం -2009, ఎ.పి ఆర్.టి.ఇ 2023, సెక్షన్ 12(1) (సి) ప్రకారం ప్రవేట్ అన్ ఎయిడెడ్ విద్యా సంస్థల్లో 25శాతం సీట్లు ఆర్థికంగా వెనుకబడిన తరగతుల పేద కుటుంబాలకు కేటాయింపు కొరకు నిబంధనలు పొందుపంచడం జరిగింది. సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వారు, దారిద్ర్యరేఖకు దిగువన వున్నవారు, భూమిలేని వ్యవసాయ కూలీలు , దివ్యాంగులు, ఎస్.సి, ఎస్టీలు అర్హులని, గ్రామ ,వార్డు సచివాలయాల్లో ఉచిత దరఖాస్తు సదుపాయం కల్పించబడిందని, పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: రాష్ట్రంలోని మహిళల సంక్షేమమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ...రాష్ట్రంలో మహిళల అభివద్ధికి సీఎం జగన్ చిత్తశుద్ధితో కషి చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కువ పథకాలను మహిళల పేరుతో అమలు చేస్తున్నారన్నారు. నాడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల మేరకు డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలు మాఫీ చేయడంలో భాగంగా మూడో విడత నిధులను విడుదల చేసినట్లు చెప్పారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన హామీలను వందశాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే చెందుతుందని చెప్పారు. నగర మేయర్ ఎస్ అముద మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా పక్షపాత ప్రభుత్వం నడుస్తోందన్నారు.



నగర కమిషనర్ జె అరుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా పురోభివద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా నగరంలోని 1-25 వార్డుల పరిధిలో 18,890 డ్వాక్రా మహిళలకు రూ.18.82 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్ తదితరులు అందించారు. అనంతరం బాలికల నత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, చుడా ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాహుల్ రాజారెడ్డి, కార్పొరేటర్లు, ఇతర నాయకులు, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్, అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించాలి
డిఆర్ఒ రాజశేఖర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఏప్రిల్ 5వ తేదీ బాబు జగ్జీవన్ రామ్, ఏప్రిల్ 14వ తేదీ బి.ఆర్.అంబేద్కర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, సభ్యులు సహకరించాలని డిఆర్ఒ ఎన్.రాజశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం డిఆర్ఒ ఛాంబర్‌లో జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులతో డిఆర్ఓ సమావేశమై బాబు జగ్జీవన్, బి.ఆర్. అంబేద్కర్ జయంతుల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ బాబు జగ్జీవన్, బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లలో భాగంగా సభ్యుల సలహాలు, సూచనలు పరిగణన లోనికి తీసుకోబడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు టి.గోవిందన్, సి.ఎల్లప్ప, కే.రవి, బి.పార్థసారథి, ఎస్.మునిస్వామి, కే.ధనంజయ రావ్, వి.దామోదరం, బి.రాజ్ కుమార్, ఎం.డేవిడ్, పి.బాబు, కె.సుబ్రహ్మణ్యం, కె.కె. రవి, ఎస్.మురుగయ్య, బి.మునిరత్నం పాల్గొన్నారు.



5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి
వ్యకాసం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి - పలమనేరు

కార్మిక, కర్షక హక్కులపై చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు పిలుపునిచ్చారు. శుక్రవారం పలమనేరు అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దడాల సుబ్బారావు, వ్యకాసం జిల్లా కార్యదర్శి ఓబులురాజు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, కనీస పెన్షన్ పదివేలివ్వాలని, నల్లచట్టాలైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్, టైంస్కేల్, స్కీం వర్కర్లకు డైలీవేజ్ కంటిన్యూజిస్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఒపిసి పునరుద్ధరించాలని, రైతులకు కనీస మద్దతు ధర గ్యారంటీ చేయాలని, కేరళ తరహాలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో 2 లక్షల కోట్లకు పెంచాలని కోరారు. కుటుంబానికి 200 రోజులు పని కల్పిస్తూ, 600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల సరుకులు సబ్సిడీ ధరకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గిరిధర్‌గుప్తా, ఐద్వా జిల్లా కన్వీనర్ భువనేశ్వరి, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, వ్యకాసం నాయకులు బాలు, మంజునాథ్, సోము, సిఐటియు నాయకులు రాజా, జయంతి, సంజయ్, ప్రతాప్, సుధాకర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

14 నుంచి ప్రజాచైతన్య యాత్రలు

సిపిఎం, సిపిఐ సంయుక్తంగా ఏప్రిల్ 14 నుంచి 30వ తేదీ వరకూ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు వెల్లడించారు. సిపిఎం కార్యాలయంలో వామపక్షాల సమావేశంలో దడాల సుబ్బారావు, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వాడ గంగరాజు, నాగరాజు మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులైన అదానీ, అంబానీలకు దేశంలోని సంపదను మోడీ ప్రభుత్వం దోచి పెడుతోందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ రాష్ట్రంలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తూ ప్రజా పోరాటాలపై ఉక్కుపాదం మోపడం దారుణమన్నారు. కేంద్రంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని ఓడించేంత వరకూ వామపక్షాలు కలిసి పనిచేస్తాయన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజు నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు గోపీనాథ్, చంద్ర, విజయగౌరి, జమిలాబి, సత్యమూర్తి, కె.సురేంద్రన్, పి.చైతన్య, బాలు పాల్గొన్నారు.

వయోవృద్ధులను సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలదే
సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:

వయోవద్ధులైన తల్లిదండ్రులను సంరక్షించాల్సిన బాధ్యత వారి పిల్లలపై ఉందని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ. కరుణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక తపోవనంలోని ఓల్డేజ్ హోంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయోవద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వై. శ్రీనివాస్‌తో కలిసి వయోవద్ధులకు సంబంధించిన చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన భారతీయ సమాజంలో సాంప్రదాయాలు, పద్ధతులు, విలువలు, తల్లిదండ్రుల భద్రతా, సంరక్షణ వారి గౌరవానికి ప్రాధాన్యతలిచ్చాయన్నారు. ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ చెదిరిపోవడంతో తల్లిదండ్రులను కుటుంబం నుండి బయటికి పంపించడం చాలా దురదష్టకరమన్నారు. తల్లిదండ్రులను సక్రమంగా చూసుకోని ఎడల అలాంటి వారికి చట్టంలో కఠినమైన శిక్షలు ఉన్నాయని తెలిపారు. సహాయ సంచాలకులు శ్రీనివాస్ మాట్లాడుతూ తల్లిదండ్రుల, వయోవద్ధుల పోషణ సంక్షేమ చట్టం 2007 ప్రకారం గా వారి భద్రత,సంరక్షణ చూడవలసిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. జాతీయ వయోవద్ధులకు ఏమైనా సమస్యలుంటే హెల్ప్ లైన్ నెం.14567 కు ఫోన్ చేసి తెలియజేయవచ్చునని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు స్థానిక అంబేద్కర్ సర్కిల్ ఎదుట నిరసన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ కు జ్యుడీషియల్ పవర్ ఇవ్వాలని, ఎయిడెడ్ జూనియర్ కాలేజీలో ఎస్సీ ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, కెజిబివిలలో పనిచేస్తున్న ఎస్సీ ఎస్టీ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రతి తరగతిలో పాఠ్యాంశంగా పెట్టాలని, యాభై ఏళ్లు దాటిన ఉద్యోగులకు డిపార్టుమెంట్ టెస్టులలో మినహాయింపు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వినాయకం, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సుశీలమ్మ, జిల్లా అధ్యక్షులు బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.



భూపరిహారం చెల్లింపుపై దృష్టి : జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవేకి భూసేకరణ ప్రకియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం జాయింట్ కలెక్టర్ ఎక్స్‌ప్రెస్ హైవేకి సంబంధించి భూసేకరణ, పరిహారం చెల్లింపులపై ప్రాజెక్టు డైరెక్టర్ కార్తీక్ రెడ్డి, ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో భూసేకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఇంకా వారికి అప్పగించాల్సిన భూములు ఏమైనా ఉంటే వెంటనే అప్పగించాలన్నారు. అదేవిధంగా రోడ్లు భవనాలు, గ్రామీణ నీటిపారుదల, ఉద్యాన శాఖ, పట్టు పరిశ్రమల శాఖల పరిధిలో ఇంకా నిర్ణయించిన గ్రామాలలో జరిగిన నష్టం వివరాలను సేకరించి అందుకు చెల్లించాల్సిన పరిహారం వివరాలను లెక్కించాలన్నారు. ఎక్స్‌ప్రెస్ హైవేకి సంబంధించి మూడు ప్యాకేజీలలో ఇంకా గణన చేయాల్సిన వాటి వివరాలను వెంటనే అందజేయాలన్నారు.



పశువుల మిశ్రమ దాణా పంపిణీ



ప్రజాశక్తి-సోమల: మండలంలోని పశువులకు పచ్చి మేత కొరత ఎదుర్కొ నేందుకు ప్రత్యామ్నాయంగా పోషక విలువలు కలిగి, అధిక లాభాన్ని ఇచ్చే పశువుల దాణా రైతులకు రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు పశు వైద్యాధికారిణి చందన ప్రియ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.3,160 ల విలువచేసే 200 కేజీల మిశ్రమ దాణాను రూ.1,860 ల సబ్సిడీతో కేవలం రూ.1,300 లకు అందజేస్తున్నామన్నారు. మొత్తం 26 మెట్రిక్ టన్నుల మిశ్రమ దాణా అందుబాటులో ఉందని, పశువులకు ఈ మిశ్రమ దాణా అందజేయడం వలన అధిక పాల దిగుబడి, పోషక విలువలు అందుతాయన్నారు. రైతులకు ఎవరికైనా ఈ మిశ్రమ దాణా అవసరమైతే రైతు భరోసా కేంద్రాలలోని తమ సిబ్బంది ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



ప్రజాశక్తి-పాలసముద్రం: అంగన్వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలపై ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సిడిపిఒ పద్మ సునందన తెలిపారు. శుక్రవారం పాలసముద్రం అంగన్వాడీ కేంద్రంలో మండల పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రానికి వస్తున్న గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా చేయాలని హెచ్చరించారు. బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హెచ్చరించారు. సూపర్వైజర్ రాధ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సోమల: మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవన్లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు శుక్రవారం చిరుధాన్యాలతో చేసిన వంటలను ప్రదర్శించారు. కార్యక్రమానికి విచ్చేసిన పలువురిని వంటలు పదార్థాలు ఆకట్టుకున్నాయి. ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీ ప్రభాకర్, ఏపీఎం శివ, వైద్య అధికారి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విస్తృత సేవా కార్యక్రమాలకు శ్రీకారం



ప్రజాశక్తి-శాంతిపురం: మండల కేంద్రంలో జేపీ వెల్నెస్ ఫౌండేషన్ సంస్థ అధినేత జయప్రకాష్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తను పేద కుటుంబం నుంచి వచ్చినట్లు, ప్రజల కష్టసుఖాలు తెలుసుకుని వారికి అండగా నిలవాలన్న ఉద్దేశంతో భగవంతుని కపతో ఫౌండేషన్ స్థాపించానని చెప్పారు. మండల పరిధిలోని పేదవాడు గుక్కెడు నీటికీ, పిడికెడు అన్నం ముద్దకు దూరం కాకూడదన్న ఆశయంతో జేపీ వెల్నెస్ ఫౌండేషన్ అనే సామాజిక సేవా సంస్థను స్థాపించి, మండల కేంద్రంలోనే కాక జిల్లా వ్యాప్తంగా 31 మండలాలలో విస్తత సామాజిక సేవా కార్యక్రమాలతో ముందుకు దూసుకెళ్తున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పౌరహక్కులు



ప్రజాశక్తి-యాదమరి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజా సమస్యలను అధికారులు నేరుగా తెలుసుకుని పరిష్కరించడానికే పౌర హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నట్లు తహశీల్దార్ వై చిట్టిబాబు అన్నారు. శుక్రవారం బోధ గట్టపల్లి గ్రామ సచివాలయంలో పౌర హక్కుల దినోత్సవం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవించే హక్కులో భాగంగా పౌర హక్కులు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ సమావేశానికి పోలీసు, రెవెన్యూ, అభివద్ధి శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన తెలుగు తమ్ముళ్లు



ప్రజాశక్తి-వెదురుకుప్పం: అమరావతిలో టీడీపీ నుండి నూతనంగా ఎన్నుకోబడిన గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ శ్రీకాంత్, చిరంజీవి, రాంభూపాల్, ఎమ్మెల్యే కోటాలో గెలుపొందిన ఎమ్మెల్సీ అనురాధను శుక్రవారం స్థానిక తెలుగు తమ్ముళ్లువారిని కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమం జీడీ నెల్లూరు ఇన్ఛార్జ్ చిట్టిబాబు నాయుడు, జీడీ నెల్లూరు మీడియా కోఆర్డినేటర్ కిషన్ చంద్ ఆధ్వర్యంలో జరిగింది. టిఎన్ఎస్ఎల్ జిల్లా అధ్యక్షులు చక్రి, మారేపల్లి మురళి, చిత్తూరు పట్టణ డివిజన్ మెంబర్ రాజశేఖర్, తవణంపల్లి మాజీ-జడ్పీటీసీ వెంకటేష్, శ్రీరంగరాజపురం మండల ఐటీ కోఆర్డినేటర్ వినోద్ పాల్గొన్నారు.

నగరి బార్ కౌన్సిల్ నూతన కార్యవర్గం ఎంపిక



ప్రజాశక్తి-నగరి: జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టు బార్ కౌన్సిల్కు నూతన కార్యవర్గాన్ని సభ్యులు శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ కౌన్సిల్ అధ్యక్షులుగా మణివాసగం, ఉపాధ్యక్షులుగా కే.వేలాయుధం, కార్యదర్శిగా ఎస్.జాన్ జోష్, ఉపకార్యదర్శిగా కే.రాము, కోశాధికారిగా ఎం.నాగ రాజులు ఎన్నికయ్యారు. జడ్జి విష్ణువర్మ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతూ ప్రశాంత వాతావరణంలో కోర్టు నడవడానికి నూతన కార్యవర్గం సహకరించాలన్నారు. సీనియర్ న్యాయవాదులు సుబ్రమణ్యం రెడ్డి, మురళీధర్, మహదేవన్, బాబు, ఉదయ భాను, జగదీష్, హనీఫా, చిరంజీవులు, పన్నూరు బాబు, ధరణి పాల్గొన్నారు.

నంది వాహనంపై కరకంఠేశ్వరుడు

ప్రజాశక్తి-నగరి: పట్టణ పరిధిలోని కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కళ్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కరకంఠేశ్వర స్వామిని అధికార నంది వాహనంపై ఊరేగించారు. ఉపాధ్యాయులు సంయుక్తంగా కలిసి రూ.2.5 లక్షల వ్యయంతో నూతనంగా తయారుచేసిన అధికార నందివాహనం తొలిసారిగా ఈ ఉత్సవాల్లో వినియోగించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేక అర్చనలు నిర్వహించారు. ప్రత్యేక అలంకారంలో ఊరేగింపుగా వచ్చిన స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి భక్తులు దర్శించుకున్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రజల నీరాజనం



ప్రజాశక్తి-కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం (సచివాలయం రెండు) పరిధిలోని తూర్పు అరుంధతీవాడ, చాకలివానిగుంట, రెడ్డిండ్లు, వడ్డిఇండ్లు బండ్రేవుకాలనీ, సుద్దగుంట, గాజుల కండ్రిగ, చింత తోపు ఎస్టీ కాలనీలలో సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో కొనసాగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు పూలవర్షంతో నీరాజనలు పలుకుతున్నారని ఇదంతా పేద ప్రజలకు సీఎం వైఎస్ జగనన్న అందిస్తున్న సంక్షేమాలతోనే సాధ్యమైందని అన్నారు. నేడు దేశం మొత్తం ఆంధ్రరాష్ట్రం వైపు చూస్తున్నాయంటే జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు వంటి చారిత్రక ఆలోచనలేనని, ఎన్నడూ లేని విధం మన రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఎంపిపి లతబాలాజీ, మండల పార్టీ కన్వీనర్ శేఖర్రాజు, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయవర్మ, పలువురు అధికారులు, సర్పంచ్లు, ఎంపిటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

పలమనేరు: అతివల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని శాసనసభ్యులు ఎన్ వెంకటే గౌడ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎస్విసిఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో పలమనేరు రూరల్ మండలానికి సంబంధించి 'వైఎస్సార్ ఆసరా' మూడవ విడత వారోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని 656 స్వయం సహాయక సంఘాల 5860 మంది సభ్యులకు సంబంధించిన రూ.5,35,61,856 ల చెక్కును ఎమ్మెల్యే, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు కలిసి పంపిణీ చేశారు. అలాగే పలమనేరు రూరల్ మండలానికి సంబంధించిన 41 సంఘాలలోని 83 మంది సభ్యులకు ఎస్సీ ఉన్నతి స్వయం సహాయక సంఘాల మహిళలకు వారి జీవనాభివృద్ధికి రూ.41.17 లక్షల చెక్కును అందజేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి, జెడ్పిటిసి మల్లికా రంగనాథం, ఎంపిపి రోజా, పంచాయతీ నాయకులు, సచివాలయం కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: మహిళలకు ఆసరా పథకం ద్వారా రూ.68,61,30,000 లను పంపిణీ చేపడుతున్నట్టు పూతలపట్టు శాసనసభ్యులు ఎమ్మెస్ బాబు అన్నారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఏపీఓ మీరాబాయి ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు ఆసరా పథకం ద్వారా రుణమాఫీని పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1503 గ్రూపులకు గాను 14,565 మంది సభ్యులకు రూ.68,61,30,000 లను డ్వాక్రా రుణమాఫీ నగదును వారి గ్రూపు ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. ఎంపీపీ అమరావతి జడ్పిటి సోమశేఖర్ వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి ఏఎంసీ ఛైర్మన్ సోమశేఖర్ సింగల్ విండో ఛైర్మన్ దత్త రెడ్డి ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి తాసిల్దార్ బెన్ రాజ్ పాల్గొన్నారు.

రామకుప్పం: స్వయం సహాయక సంఘ మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందాలని చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం వైఎస్ఆర్ ఆసరా పంపిణీ సమావేశం నిర్వహించారు. మూడో విడత వైఎస్ఆర్ ఆసరా 931 గ్రూపులు 8447 మంది మహిళలకు రూ.6.47 కోట్లు, మహిళా సమైక్య 79 గ్రూపులకు రూ.39.72 లక్షల చెక్కులను స్వయం సహకార సంఘ మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డప్ప ,జడ్పిటిసి నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-శాంతిపురం: వైఎస్సార్ ఆసరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ బుల్లెట్, ఏపీఎం గీత, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సుబ్బు శుక్రవారం కోరారు. కుప్పం నియోజకవర్గంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయని వారు తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వైసీపీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ భరత్ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి వచ్చే మహిళల కోసం భోజన వసతి ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

రూ.2.60 కోట్ల పన్ను వసూలు



ప్రజాశక్తి-నగరి: మున్సిపాలిటీలో 2023-24 సంవత్సరానికి రూ.53.23 కోట్ల అంచనా బడ్జెట్ను రూపొందించినట్లు మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్, సాధారణ సమావేశం నిర్వహించారు. నూతన బడ్జెట్ కాపీలను అధికారులు కౌన్సిల్ సభ్యులకు అందజేశారు. బడ్జెట్ కాపీలలో ఆదాయం సమకూరే మార్గాలు వాటిని ఏ అభివద్ధి పనులకు వినియోగించనున్నారన్న అంశాలను పొందుపరచారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి బడ్జెట్పై సభ్యులకు అవగాహన ఏర్పరిచారు. రానున్న ఏడాదికి అంచనా ఆదాయం 53.24 కోట్లన్నారు. ఇందులో అభివద్ధి పనులకు రూ.48.96 కోట్లు అంచనా కేటాయింపులు చేయడం జరిగిందన్నారు. కౌన్సిలర్ దయానిధి మాట్లాడుతూ గతంలో మున్సిపల్ పరిధిలో రికార్డులు సక్రమంగా లేని కారణంగా తొలగిపోయిన పెన్షన్లలో అర్హులైన వారికి మళ్లీ పెన్షన్లు వచ్చేలా చేసినందుకు, అలాగే నేత సామాజిక వర్గం వారికి విద్యుత్ బిల్లుల కేటగిరి మార్చిన మళ్లీ వారికి పాత విధానంలోనే విద్యుత్ బిల్లులు చెల్లించేలా చేసినందుకు సీఎం జగన్కి, మంత్రి ఆర్కేరోజాకు కతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ 2005లో మున్సిపాలిటీ ఏర్పడిందని ఇప్పటి వరకు బకాయిలపై 100 శాతం వడ్డీ మినహాయింపు ఎవ్వరూ చేయలేదన్నారు. వడ్డీ మినహాయించడంతో రూ.2.60 కోట్ల మేర పన్ను వసూలైందన్నారు. 57 లక్షలు మాత్రమే బకాయి కింద ఉందన్నారు. వసూళ్లలో నగరి మున్సిపాలిటీ జిల్లాలో 2వ స్థానానికి చేరుకుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి చి వరి సమావేశం కావడం, పన్నుల వసూళ్లలో సిబ్బంది చురుగ్గా వ్యవహరించడంతో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి సిబ్బందికి, కౌన్సిల్కు విందుభోజనం పెట్టారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్కు ఇద్దరి విద్యార్థుల ఎంపిక





ప్రజాశక్తి-కార్వేటినగరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్కు డైట్ మోడల్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం గాజుల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మోడల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పి.గీతిక, ఎం.మోహన ప్రియలు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి ఉపకార వేతనంతో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి ఏటా రూ.12 వేలు స్కాలర్షిప్ను కేంద్రప్రభుత్వం నేరుగా విద్యార్థులకు అందజేస్తుందన్నారు. ఆర్థికంగా వెనుకబడి ప్రతిభా వంతులైన విద్యార్థులకు ఆర్థికంగా ఆదుకుని డ్రాపౌట్ల సంఖ్యను తగ్గించడానికి జాతీయ స్థాయిలో ప్రతిభా పరీక్షలు నిర్వహించి ప్రతి ఏటా దేశ వ్యాప్తంగా లక్ష మందిని ఎంపిక చేసి కేంద్ర ప్రభుత్వం స్కాలర్షిప్ అందిస్తుందన్నారు. పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడంతో వారిని డైట్ ప్రిన్సిపల్ ప్రభాకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వాసుదేవ మందడి, కళ్యాణ్, కుమారస్వామి, విమాలవతి, హసీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



ప్రజాశక్తి-వి.కోట: జరగనున్న పదో తరగతి పరీక్షల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరూ వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని పత్రపల్లి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొదటగా సరస్వతి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఒత్తిడిని అధిగమించి పరీక్షలు రాయాలని కోరారు. రాష్ట్రస్థాయిలో పదవ తరగతి ఉత్తీర్ణతలో జిల్లాని అత్యుత్తమ స్థాయిలో నిలిపేందుకు ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులు కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ఉన్నత శిఖరాలు ఎదిగేందుకు విద్య ఎంతో అవసరమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం 10వ తరగతి వీడ్కోలు సమావేశం జరిగింది. మొదట సరస్వతి పూజ చేశారు. తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వీడ్కోలు సమావేశం జరిగింది.



యాదమరి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల 62వ వార్షికోత్సవం, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ప్రధానోపాధ్యాయులు గిరిరాజ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మొదట సరస్వతీ దేవి ఆరాధన, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలు, సాంస్కతిక కార్యక్రమాలు అతిథులను అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ రాజారెడ్డి, స్థలదాత చంద్రశేఖర రెడ్డి, రిటైర్డ్ ఉపాధ్యాయులు లోక రక్షక, ఇతర ప్రధానోపాధ్యాయులు రమేష్ బాబు, పార్థసారథి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎంఆర్సి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వేపంజేరి గ్రామంలో గల శ్రీ లక్ష్మీ నారాయణ స్వామిలకు కల్యాణోత్సవ పూజలను వైభవంగా నిర్వహించారు . శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణులకు పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరణలు చేసి కల్యాణోత్సవం పూజలు వైభవంగా నిర్వహించారు. ఈపూజలకు యుఎస్ఏకి చెందిన మైథిలి, ప్రత్యూష్ దంపతులు ఉభయదారులుగా, అదేవిధంగా అన్నదాన కార్యక్రమానికి యుఎస్ఏకి చెందిన మనోజ్ ఉభదారులుగా వ్యవహరించారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులకు ఆలయంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేష్లురెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అలంకరణలో శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి

ప్రజాశక్తి-రామకుప్పం: మండల కేంద్రంలోని అన్నపూర్ణాంబ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి ఉత్సవమూర్తిని బ్రాహ్మణ సంఘం వారు వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ఉత్సవం పై అధిరోహించారు. ఆలయ మాడవీధుల్లో మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణ నడుమ స్వామివారిని విహరించారు. అడుగడుగునా భక్తాదులు స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి మొక్కలు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా రైతు సంఘం, బాలాజీ స్వామి, బ్రాహ్మణ సంఘం వారు వ్యవహరించారు. నిర్వాహకులు భక్తాదులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అధునాతన రక్తపరీక్ష కేంద్రం ప్రారంభం



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రమైన బైరెడ్డిపల్లిలో శుక్రవారం అధునాతన రక్త పరీక్ష కేంద్రాన్ని మండలాధ్యక్షుడు మొగశాల రెడ్డెప్ప ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నేటి పరిస్థితులకు అనుగుణంగా అధునాతన పరికరాలు ఏర్పాటుచేసిన వారిని అభినందించారు. గ్రామీణ ప్రజలు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండల వైసీపీ నూతన పార్టీ అధ్యక్షుడి బాధ్యతలు శుక్రవారం పద్మనాభ రెడ్డి చేపట్టారు. దీనికి సంబంధించిన జీవో జిల్లా కార్యాలయం నుండి అందినట్లు పార్టీ శ్రేణులు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా మాజీ జడ్పిటిసి సభ్యులు బండి గోవర్ధన్ రెడ్డి వ్యవహరించారు. అనంతరం కామసాని పద్మనాభరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో, నాపై అధిష్టానం, డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి ఎంతో నమ్మకంతో ఈ పదవిని అప్పగించినట్లు తెలిపారు. మండలంలోని నాయకులను కలుపుకొని పార్టీ అభివద్ధికి తన వంతు కషి చేస్తానని చెప్పారు. అనంతరం గహ సారథుల ఛైర్మన్ బట్టీ సుబ్రహ్మణ్యం ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు సుకుమార్, ఎంపీపీ బండి నాగరాణి పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన జడ్పీ ఛైర్మన్



ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని కీలపట్ల గ్రామ సచివాలయాన్ని శుక్రవారం జడ్పీ ఛైర్మన్ జి.శ్రీనివాసులు సందర్శించారు. అనంతరం సిబ్బంది హాజరు, సిఎల్, స్పందన, సచివాలయ సర్వీస్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలు-సంక్షేమ పథకాలు అర్హులకు తప్పకుండా అందాలని, స్పందన కార్యక్రమం తప్పని సరిగా నిర్వహించి వినతులను ఆలస్యం వహించకుండా పరిష్కరించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది సమయానికి విధులకు హాజరై తమ పరిధిలోని ప్రజల సమస్యలను, పంచాయతీ అభివద్ధి కార్యక్రమాలను మండల స్థాయి అధికారులకు చేరవేసి, ఆ సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన మదర్థెరిసా విద్యార్థులు

ప్రజాశక్తి-గంగవరం: మండలంలోని మదర్ తెరిసా విద్యాసంస్థల విద్యార్థులు రెండవ సెమినార్ పరీక్షల్లో ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో అధిక ఉత్తీర్ణత సాధించినట్లు అకాడమీ అధికారి రాజేందర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఇందులో బీఎస్సీ గ్రూప్కి చెందిన శశి కుమార్, కుసుమ, గంగాధర్, శిరీష, నిఖిల్, బీకాంలో వర్షిణి, తేజశ్రీ, రమణ, బీబీహెచ్ గ్రూపులో జ్యోతి, అర్చన, కుసుమలు యూనివర్సిటీ టాఫర్లు గా మార్కులు సాధించినట్లు తెలియజేశారు. దీంతో యాజమాన్యం వీరిని అభినందించినట్లు పేర్కొన్నారు.

2 నుంచి కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: స్థానిక శ్రీ కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 2 నుండి 9వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు కొత్తమాచు వంశస్థులు శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2వ తేదీ సాయంత్రం స్వస్తివాచనం, అంకురార్పణ, యాగశాల ప్రవేశం తదితర కార్యక్రమాలతో మొదలై 9వ తేదీ ద్వాదశి, తిరువారాధన, ఊంజల్సేవ కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి కపకు పాత్రులు కావాలని వారు కోరారు.

విద్యాసామాగ్రి వితరణ



ప్రజాశక్తి-యాదమరి: మండలంలోని కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం పిఆర్టియు జిల్లా కార్యదర్శి జె.హిమబిందు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచారి కలిసి సుమారు రూ.4 వేలు విలువచేసే రైటింగ్ ప్యాడ్స్ అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు యస్.రమేష్ బాబు అన్నారు. ఉపాధ్యాయులు మదన్, మోహన్, నరసింహా రెడ్డి, భాస్కర్ రెడ్డి, మురళీధర్, త్రివేణి, ఉష, భారతి, వాణి, పద్మ, అరుణ పాల్గొన్నారు.

ముగ్గురికి రెండేళ్ల జైలు శిక్ష



ప్రజాశక్తి-నగరి: నింద్ర మండలం నెట్టేరి గ్రామానికి చెందిన ఎన్.గీత 2017 సంవత్సరంలో భర్త, అత్త మామలైన ఎన్ఎస్ శ్రీహరి, ఎన్.అంకమందడి అనే సుబ్రమణ్యం మందడి, ఎన్.అలిమేలులు గృహహింస చేస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే నింద్ర మండలం కొప్పేడు దళితవాడకు చెందిన వి.యశోద 2018 సంవత్సరంలో తన భర్త రెండో పెళ్లి చేసుకున్నాడంటూ అతనిపై చర్యలు చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదుల మేరకు సీఐ రాజశేఖర్ కేసు నమోదు చేశారు. ఈ కేసులు శుక్రవారం నగరి జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో విచారణకు వచ్చింది. ఏపీపీ రామశాంతి వాదనలు విన్న జడ్జి విష్ణువర్మ గహహింస కేసులో ముద్దాయిలకు రెండేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.26వేలు వంతున జరిమానా విధించగా, రెండో పెళ్లి కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధించారు. నింద్ర ఎస్ఐ సుబ్బమ్మ, కోర్టు కానిస్టేబుల్ హరిప్రసాద్, కానిస్టేబుళ్లు హరి, కేశవులు ముద్దాయిలను జైలుకు తరలించారు.

బొలెరో వాహనం బోల్తా

పలువురికి గాయాలు



ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని కష్ణరాజపురం సమీపంలో బొలెరో వాహనం బోల్తా పడి మహిళలకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా... మండలంలోని ఉనిసిగాని పల్లి పంచాయతీకి చెందిన స్వయం సహాయక సంఘ మహిళలు రామకుప్పంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్ఆర్ ఆసరా సభకు వస్తుండగా మార్గమధ్యమైన కృష్ణరాజపురం గంగమ్మ చెరువు సమీపంలో రామకుప్పం నుంచి వస్తున్న పాల లారీ తప్పించబోయి అదుపుతప్పి బొలెరో వాహనం బోల్తా పడింది. దీంతో సుమారు 35 మందికి స్వల్ప గాయాలు కాగా, ముగ్గు రికి కాళ్లు ,చేతులు విరిగి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రు లను వైసీపీ నేతలు తమ సొంత వాహనాల్లో మెరుగైన వైద్యం కోసం కుప్పం పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్, అధికారులు, ప్రజాప్రతినిధులు వారిని ఆసుపత్రిలో పరామర్శించారు. చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కోరారు. క్షతగాత్రులకు వైద్య సేవల ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. అధిక గాయాలైన వారికి రూ.2 లక్షలు, స్వల్ప గాయాలైన వారికి రూ.25 వేల చొప్పున ఎక్స్ గ్రేషియో అందించనున్నట్లు తెలిపారు.

'పేదల గుండెచప్పుడు రాహుల్ గాంధీ'


ప్రజాశక్తి-వెదురుకుప్పం: పేదల గుండె చప్పుడు రాహుల్ గాంధీ అని పీసీసీ సభ్యులు పోటుగారి భాస్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో పోటుగారి భాస్కర్ మాట్లాడుతూ నిత్యం పేదల బాగోగుల గురించి ఆలోచిస్తూ పార్లమెంట్లో సమయం దొరికినప్పుడల్లా పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై, బడాబాబుల రుణమాఫీపై ప్రజాస్వామ్యబద్ధంగా కేంద్ర ప్రభుత్వంపై పోరాడుతున్న రాహుల్ గాంధీ లోకసభ సభ్యత్వాన్ని రద్దు చేసి ఆయన గొంతు నొక్కి అవమానపరచడం అప్రజాస్వామికం అన్నారు.

భూ సర్వే పరిశీలన



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం రీ సర్వే జరిగిన వీర్ల బండ రెవెన్యూ గ్రామంలో సర్వే రాళ్లను నాటిన స్థలాన్ని శుక్రవారం స్థానిక తహశీల్దార్ జి.ఎం కుమారస్వామి, మండల సర్వేయర్ సాయిరాజ్ నాయక్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రవిచంద్ర, గ్రామ రెవెన్యూ అధికారి చెంగల్ రావు, జయరాం, గ్రామ సర్వేయర్ ప్రతాప్ రెడ్డి, హరీష్, రామచంద్ర, విఆర్ఎలు పరిశీలించారు.

ఎంపీటీసీలను విచారించిన డీఎల్డీవో



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని 7 మంది ఎంపీటీసీలను, ఎంపీడీవో, జూనియర్ అసిస్టెంట్లను డీఎల్డీవో రవికుమార్ శుక్రవారం విచారణ చేసి నివేదికలు సిద్ధం చేశారు. మండలంలో ఈ ఏడాది ఫిబ్రవరి 27వ తేదీన జిల్లా కలెక్టరుకు ఎంపీడీవో శ్రీదేవి, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ రెడ్డి పై స్పందనలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి విచారణ అధికారిగా డీఎల్డీఓ రవికుమార్ని యమించారు. అందులో భాగంగా ఫిర్యాదు చేసిన 13 మంది ఎంపీటీసీల్లో 7 మంది ఎంపీటీసీలు మాత్రమే హాజరైతే వారి వద్ద, అదేవిధంగా రాజరాజేశ్వరి బోర్ వెల్స్ యజమాని వెంకటేష్ రెడ్డి దగ్గర, ఎంపీడీవో శ్రీదేవి, జూనియర్ అసిస్టెంట్ బాలాజీ రెడ్డి వద్ద వేరువేరుగా విచారణచేసి వారి వద్ద స్టేట్మెంట్ రికార్డ్ చేసుకున్నారు. ఈ నివేదికలను జడ్పీ సీఈఓ ద్వారా తదుపరి ఉత్తర్వులు నిమిత్తం జిల్లా కలెక్టర్కు స్టేట్మెంట్ రికార్డు నివేదికలను పంపించనున్నట్లు విచారణ అధికారి పేర్కొన్నారు.

బంగారంపై రుణాలు

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రైతులకు వ్యవసాయ రుణాలతో పాటు బంగారంపై తక్షణ రుణాలు మంజూరు చేస్తున్నామని సంఘ ఛైర్మన్ ఓబుల్ రెడ్డి అన్నారు. శుక్రవారం సంఘ ఛైర్మన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో వడ్డీ చెల్లించి లాభాలు బాటలో సంఘాన్ని నడిపించేందుకు సహకరించాలన్నారు. ఈ సమావేశానికి సంఘ సీఈఓ ఎన్.రామరాజు, విభాగ సహకార శాఖ అధికారి ఆనంద్, సంఘం పాలక వర్గ సభ్యులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.